క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

నల్లచెరువు: మండల పరిధిలోని మద్దిమడుగు గ్రామంలో జరుగుతున్న చెరువు పూడికతీత పనులను, ఎంపీడీఓ శకుంతల గురువారం పరిశీలించారు. ప్రతి కూలీకి రోజువారి వేతనం రూ.272 పడేలా కొలతలు ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచనలిచ్చారు. ఉపాధిహామీ పనులను గ్రామంలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ ఓఆర్ఎస్ తాగాలని సూచించారు. అనంతరం కూలీలకు సంబంధించిన మస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ గుర్రప్ప పాల్గొన్నారు.

నేడు ప్రథమ వార్షికోత్సవం

కొత్తచెరువు: మండల కేంద్రంలోని పెద్దమ్మ దేవాలయంలో శుక్రవారం ప్రథమ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి పెద్దన్న తెలిపారు. అమ్మవారిని ప్రతిష్టించి, ఏడాది పూర్తి కావడంతో శుక్రవారం నుంచి పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న అర్చకులు, దాతలు, ఆలయ కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం సమక్షంలో ఆలయ అర్చకులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సాంప్రదాయంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనాలపై లక్ష్మీ చెన్నకేశవస్వామి ఊరేగనున్నారని కమిటీ సభ్యులు తెలిపారు.

గుర్తింపు కార్డుల పంపిణీ

ధర్మవరం: చేనేత కార్మికులకు ప్రభుత్వం 50 ఏళ్లకే పింఛన్ నదుపాయం కల్పించిందని వార్డు సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ గుర్తింపు కార్డులతో ప్రతి చేనేత కార్మికుడు 50 ఏళ్లకే పింఛన్ తీసుకోవచ్చని తెలిపారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన



ధర్మవరం రూరల్: మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపసంచాలకులు డాక్టర్ టివి సుధాకర్, డాక్టర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. లింగ నిర్ధారిత వీర్యం, ముర్రుపాలు, ఖనిజ లవణాల ప్రాముఖ్యతను వివరించారు. నట్టల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. జయచంద్రారెడ్డికి చెందిన హెచ్ఎఫ్ జాతికి చెందిన లేగదూడకు మొదటి బహుమతి, అలాగే నారాయణరెడ్డికి చెందిన లేగదూడకు రెండో బహుమతి, నారాయణకు చెందిన దూడకు మూడో బహుమతి అందజేశారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'తో మెరుగైన వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జ్యోతిర్మయి

తాడిమర్రి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని వైద్యాధికారి జ్యోతిర్మయి పేర్కొన్నారు. మండలంలోని పూలఓబయ్యపల్లి గ్రామంలో 104 వాహన సిబ్బందితో కలసి గురువారం గ్రామస్తులకు వైద్య చికిత్సలు అందించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య చికిత్సల కోసం మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వెళ్లాల్సిన పని లేదన్నారు. పది రోజులకు ఒకసారి గ్రామంలో 104 వాహనం ద్వారా గ్రామస్తులకు వైద్య సేవలు అందిస్తామన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు రావన్నారు. అలాగే సచివాలయం ఉన్న గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ క్లినిక్‌లలో 12 రకాల పరీక్షలు చేస్తారని తెలిపారు. 64 రకాల జబ్బులకు మందులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుభాషిణి, ఏఎన్ఎం గాయిత్రి, ఆశాకార్యకర్త కళావతి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 18వ వార్డులో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులోని ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుకు పక్కనే రైల్వే గేటు ఉండటంతో అక్కడ వేసిన చెత్తాచెదారం, మురుగు నీటితో ఇళ్లలోకి దుర్వాసన వస్తోందని పలువురు ఎమ్మెల్యేకు విన్నవించారు. విద్యుత్ సరఫరాలో రాత్రిళ్లు హెచ్చు తగ్గులు వస్తుండటంతో ఇళ్లలోని బల్బులు, ఫ్యాన్లు, టీవీలు కాలిపోతున్నాయని తెలిపారు. పవర్‌లూమ్స్ మగ్గాల వల్ల కరెంటు అప్‌అండ్‌డౌన్ అవుతోందని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ.. అర్హత ఉన్న లబ్ధిదారులకు వారి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. వాటిని క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, వైస్ చైర్మెన్లు భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ కాళంగి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు గుండా ఈశ్వరయ్య, కౌన్సిలర్లు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని నేలకోట తండాలో నూతనంగా నిర్మించనున్న చౌడేశ్వరీ దేవి, బోయకొండ ఆంజనేయ స్వామి దేవాలయాల నిర్మాణాలకు గురువారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తనయుడు కేతిరెడ్డి సూర్య ప్రతాప్‌రెడ్డి రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ధర్మవరం ఎమ్మెల్యే నివాసంలో గ్రామ పెద్దలకు అందజేశారు.

లో ఓల్టేజీకి శాశ్వత పరిష్కారం

ముదిగుబ్బ: మండల పరిధిలోని దొరిగిల్లులో రూ.2.8 కోట్లతో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి గురువారం సాయంత్రం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొరిగిల్లు పరిసర ప్రాంతాల రైతులు ఎదుర్కొంటున్న లో ఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం సబ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గతంలో మల్లేపల్లి, రాళ్లఅనంతపురం ప్రాంతాల్లో రెండు సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ.130 కోట్లతో చిన్న డీపీలను తీసి వేసి పెద్ద డీపీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలో మంగళమడకలో కూడా ఒక సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. దొరిగిల్లు పరిసర ప్రాంతాల్లోని సుమారు 10 గ్రామాలకు 1,581 అగ్రికల్చర్ సర్వీసులు ఉన్నాయని, అదే విధంగా 1,531 ఇంటి సర్వీసులు కూడా ఉన్నాయన్నారు. హెచ్‌వీడీఎస్ ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలు పరిష్కరించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మలకవేమల క్రాస్ సమీపంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు విద్యుత్ అవసరం కాబట్టి లో ఓల్టేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ సబ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు కొత్తగా సర్వీసులు కావాలంటే రూ.140 మీ-సేవలో చెల్లిస్తే నెల రోజుల్లోపు సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సురేంద్రబాబు, ఈఈ మోహనమ్మ, ఏడి ఆనందబాబు, ఏఈ చంద్రానాయక్, తహసీల్దార్ నాగేంద్ర, ఎంపీడీఓ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, మునిచంద్ర, సేవేనాయక్, శివారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పాల్యం క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలోని పలు గ్రామాల్లోని పేకాట స్థావరాలపై గురువారం ఎస్ఐ నరసింహుడు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. బుక్కపట్నం చెరువు వద్ద మామిడి తోటలో పేకాట ఆడుతున్న 5 మందిని అరెస్ట్ చేశారు. రూ.13,960 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో జూదం ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళకు తీవ్ర గాయాలు

లేపాక్షి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. చిలమత్తూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన నంజమ్మ, ఆమె కుమారుడు సజ్జప్ప హిందూపురం నుంచి సొంత గ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. అయితే నాయనిపల్లి గ్రామానికి చెందిన టెంకాయలు వ్యాపారం చేసే ఓ వ్యక్తి ఎదురుగా వస్తున్న వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో నంజమ్మ కుడికాలు విరిగింది. స్థానికులు చికిత్స నిమిత్తం ఆమెను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కంటి అద్దాల పంపిణీ



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

తలుపుల: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరికీ కంటి చూపు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్యాధికారులు ముస్వర్‌బాషా, సల్మా అన్నారు. గురువారం స్థానిక కేజీబీవీ స్కూల్‌లో గత నెలలో కంటి పరీక్షలు చేయించుకున్న విద్యార్థులతో పాటు దృష్టిలోపం ఉన్న వారికి కంటి అద్దాలు అందజేశారు. అలాగే వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ ప్రాధాన్యత వివరించారు. ఉబ్బరవాండ్లపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి సల్మా వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఓ మోహనమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక రుగ్మతలు దూరం



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ సేవా పథకం వలంటీర్లు

అనంతపురం: యోగాతో మానసిక, శారీరక రుగ్మతలు తొలగించుకోవచ్చని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.ఆర్. సదాశివారెడ్డి అన్నారు. మనిషి మనుగడ సాధించడానికి యోగా ఒక్కటే శరణ్యమని అన్నారు. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్-క్యాంపస్ ఆర్ట్స్ కళాశాల) ఆధ్వర్యంలో వారం రోజులుగా జాతీయ సేవా పథకం శిబిరాన్ని నిర్వహించారు. ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ పాల్గొని ఉత్తేజ పూరితమైన ప్రసంగం చేశారు. కార్యక్రమంలో బీఈడీ కళాశాల బోధన సిబ్బంది , ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలోని సున్నపుగుట్ట తండా జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. నిరంతరం పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి పాటుపడుతున్నారని తెలిపారు. జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్, మండల కన్వీనర్ ప్రకాష్, సీనియర్ నాయకుడు బత్తల ఆదినారాయణ, కో-ఆప్షన్ అల్లాబకాష్, సచివాలయాల కన్వీనర్ మధుసూధన్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రసాద్, ఎంపీడీఓ సుధామణి, హౌసింగ్ అధికారులు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకెళ్తే విజయం తథ్యం



ఆర్ఓ ప్లాంటును ప్రారంభిస్తున్న ఎస్కే యూనివర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మయ్య

ధర్మవరం అర్బన్: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్తే విజయం తథ్యమని ఎస్కే యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎస్‌వీ లక్ష్మయ్య, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనంతపురం వాస్తవ్యులు ప్రస్తుతం అమెరికాలోని కాలిఫోర్నియాలో స్థిరపడిన డాక్టర్ వినోద్, డాక్టర్ కైప ప్రసాద్ తమ తండ్రి కైపా లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు రూ.1.20 లక్షలు విలువ చేసే నీటి శుద్ధి ప్లాంటును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాదని తెలిపారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకునే వరకూ కష్టనష్టాలను ఎదుర్కోవాలని తెలిపారు. కార్యక్రమంలో పెనుకొండ న్యాయవాది ప్రతాప్‌రెడ్డి, అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకు బాలచందర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జీవన్‌కుమార్, అధ్యాపకులు రబియాబేగం, చిట్టెమ్మ, షమీవుల్లా, కిరణ్‌కుమార్, పావని, భువనేశ్వరి, రామమోహన్‌రెడ్డి, పుష్పావతి, గౌతమి, ఆనంద్, స్వామి పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న నాడు-నేడు డీఈ రంగనాథరావు

ఓడీ చెరువు: మండలంలో నాడు-నేడు కింద చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కేజీబీవీ కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నాడు-నేడు డీఈ రంగనాథరావు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ పోలప్ప, ఎంఈఓ ఖాదర్‌వలి బాషాతో కలసి ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఆర్పీలు, సచివాలయ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. నాడు-నేడు కింద మండలంలో 30 ప్రభుత్వ పాఠశాలలు, 2 అంగన్‌వాడీ కేంద్రాలు, 1 కేజీబీవీ కళాశాలలో నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. కొన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి నిధులు ఖాతాలో జమ అయినప్పటికీ వినియోగించక పోవడంతో కారణాలను అడిగి తెలుసుకున్నారు. నిధులు ఉన్న చోట వెంటనే డబ్బులు డ్రా చేసి పనులు పూర్తి చేయాలన్నారు. నిధులు ఇచ్చిన కూడా పనులు చేయించలేని ఉద్యోగులపై సంజాయిషీ కోరారు. వెంటనే పనులు చేపట్టి త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ, ఉపాధ్యాయులు శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎస్ఓ షబానా పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'జగనన్నే మా భవిష్యత్'



మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను చూపుతున్న పార్టీ సీఈసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి

నల్లమాడ: వైఎస్సార్‌సీపీ వినూత్నంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని పులగంపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో కుమారుడు చక్రధర్ రెడ్డితో కలిసి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజల అనుమతితో వారి ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా గృహ సారథులు, వలంటీర్లు ఇప్పటివరకు రాష్ట్రంలో కోటికి పైగా ఇళ్లను సందర్శించడం విశేషమన్నారు. 2024లో రాష్ట్రంలో రెండోసారి వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీ సాధించడం ఖాయమన్నారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం అవుతారని పేర్కొన్నారు.

పుట్టపర్తిలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సేవలు



బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖను ప్రారంభిస్తున్న సెంట్రల్‌ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: జిల్లా కేంద్రంమైన పుట్టపర్తిలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సేవలు అందుబాటులోకి రావడం శుభపరిణామని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు పేర్కొన్నారు. గురువారం ప్రశాంతి గ్రాంలో సత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఎదురుగా శ్రీసత్యసాయి జిల్లాలో తొలి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రజలు బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర డిప్యూటీ జోనల్ మేనేజర్ రజనీ కుమార్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో జిల్లాలోనే మొదటి శాఖను ప్రశాంతి గ్రాం వద్ద ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బ్యాంక్ ద్వారా ప్రజలకు వ్యవసాయ, హౌసింగ్, వ్యాపార, వ్యక్తిగత లోన్లు విరివిగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సీనియర్ మేనేజర్ బాబునాయక్, బ్రాంచ్ మేనేజర్ సతీష్, ,నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, నాయకులు కొండసాని సురేష్ రెడ్డి, రుషీకేశవరెడ్డి, బాబుల్‌రెడ్డి, శ్రీనివాసులు, నాయుడు, గురుప్రసాద్‌రెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో మెరిసిన విద్యార్థులు



మాధవి (419)



గాయత్రి (365)



వనజ (871)



దివ్యాంజలి (950)

తనకల్లు: స్థానిక ఎస్‌జీఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ద్వితీయ సంవత్సం విద్యార్థిని దివ్యాంజలి ఇంటర్ ఫలితాల్లో కళాశాల టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ ప్రశాంత్ గురువారం తెలిపారు. దివ్యాంజలి ఎంపీసీలో 950 మార్కులు సాధించిందన్నారు. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో మొత్తం 68 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 44 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్‌లో 58 మందికి గానూ 22 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 37.93 శాతం ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద ఉన్న మోడల్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారని ప్రిన్సిపాల్ రమేష్‌బాబు పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 61 మంది విద్యార్థులకు గాను 37 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ సీఈసీలో లక్ష్మీశరణ్య 453 మార్కులు, శిరీష 431 మార్కులు, ఎంపీసీలో పుష్పలత 413 మార్కులు, బైపీసీలో ఝాన్సీ 376 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఇంటర్ రెండవ సంవత్సరంలో 49 మంది పరీక్షలకు హాజరుకాగా.. 27 మంది ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. బైపీసీలో అనూష 802 మార్కులు, ఎంపీసీలో కిరణ్‌కౌషిక్ 776 మార్కులు, సీఈసీలో తేజశ్విని 768 మార్కులు, సీఈసీలో చందు 746 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారన్నారు.

కదిరి అర్బన్: ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 58 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌రాజ్ తెలిపారు. సెకండ్ ఇయర్ బైపీసీ గ్రూపులో హిమనందిని 960 మార్కులు, సెకండ్ సీఈసీలో సాయిశ్రీ 940, సెకండ్ ఎంపీసీలో దివ్య 936, సెకండ్ బైపీసీలో నాజియా 933, సెకండ్ ఎంపీసీలో ప్రతిమ 926 మార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్ బైపీసీ గ్రూపులో సమత 449 మార్కులు సాధించింది.

చెన్నేకొత్తపల్లి: స్థానిక కస్తూరిబా, మోడల్ స్కూల్‌లలో ఇంటర్ ఉత్తీర్ణత శాతం తగ్గింది. కస్తూరిబా పాఠశాలలో 24 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా కేవలం ఐదుగురు విద్యార్థులు పాసయ్యారు. 19 మంది ఫెయిల్ అయ్యారు. మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 43 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 23 మంది ఉత్తీర్ణత సాధించారు. 20 మంది ఫెయిల్ అయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 61 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 32 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 29 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో మాధవి (ఎంపీసీ) 419 మార్కులు, గాయత్రి (ఎంపీసీ) 365 మార్కులు, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో వనజ (ఎంపీసీ) 871 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. మే 6 తేదీ వరకూ రీ వెరిఫికేషన్‌కు అవకాశం ఉంటుందన్నారు.

జీపీఎఫ్ స్లిప్‌లు వచ్చేలా చూడండి

అనంతపురం అర్బన్: నాల్గో తరగతి ఉద్యోగులకు సంబంధించి జీపీఎఫ్ (భవిష్య నిధి) స్లిప్‌లు వచ్చేలా చూడాలని సహాయ ఖజానా అధికారి (ఏటీఓ) రాణికి నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు విన్నవించారు. గురువారం ఏటీఓని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, గౌస్‌పీరా, ఇతర నాయకులు డీడీ చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేసి, సమస్య వివరించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీపీఎఫ్ స్లిప్‌లు రాలేదన్నారు. నాలుగు డీఏలను కలిపి ఆ తరువాత తొలగించినప్పటి నుంచి ఈ సమస్య ఉందన్నారు. జీపీఎఫ్‌కు తాము ప్రతి నెలా ఎంత మొత్తం చెల్లిస్తున్నామో కనిపిస్తోందని, అయితే తమ ఖాతాలో ఎంత మొత్తం ఉందనేది రాలేదన్నారు. అప్‌డేట్ చేస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కాబట్టి తమ సమస్యను డీడీ ద్వారా ప్రభుత్వం తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పెద్దన్న, భాస్కర్, వాజిద్‌బాషా, ముక్తియార్, ప్రకాశ్, లక్ష్మీదేవి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

తమలపాకు తోట నరికివేతపై కేసు నమోదు

రొళ్ల: మండల పరిధిలోని ఎల్‌కే పల్లివడ్రహట్టి గ్రామానికి చెందిన రైతు యల్లప్ప సాగు చేసిన తమలపాకు తోటను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి నరికి వేసిన సంఘటన తెలిసిందే. యల్లప్ప తన పొలంలో 400 వక్క చెట్ల (తోట)లో అంతర పంటగా తమలపాకు తోటను సాగు చేవారు. గుర్తు తెలియని వ్యక్తులు తోటలోకి ప్రవేశించి 400 వక్క చెట్లకు అంటు రూపంలో కట్టిన తమలపాకు తోటను నరికి వేశారు. గురువారం ఏఎస్ఐ బాలాజి తమలపాకు తోటను పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

స.హ చట్టంపై అవగాహన పెంచుకోవాలి

అనంతపురం కల్చరల్: సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని పలువురు వక్తలు అన్నారు. గురువారం సహ చట్టం పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్‌నగర్ కాలనీలో సహచట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన సమావేశాల్లో సంఘం ప్రతినిధులు వన్నూరప్ప, నబీ రసూల్, రషీద్‌బాషా, తోట బాలన్న , దేవి కృష్ణయ్య తదితరులు సహ చట్టం అమలు తీరుపై మాట్లాడారు. సీనియర్ రచయిత తరిమెల అమరనాథరెడ్డి, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రత్యూష సుబ్బారావు, జనార్దన తదితరులు పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని యాదవవీధిలో నివాసం ఉంటున్న ఆంజనేయులు తన భార్య గాయత్రిపై గురువారం దాడి చేశాడు. వివరాలు.. భార్యాభర్తలు అయిన గాయత్రి, ఆంజనేయులు మధ్య నెల రోజులుగా కుటుంబ కలహాలున్నాయి. దీంతో భార్య గాయత్రి పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో గురువారం కురగాయల మార్కెట్‌కు వచ్చిన గాయత్రిని ఆంజనేయులు కొట్టాడు. ఈ ఘటనలో స్వల్పంగా గాయపడిన ఆమెను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.